# 'స్థానిక' రిజర్వేషన్లపై గుబులు

## కొత్త ప్రభుత్వంలో గ్రామపంచాయతీ రిజర్వేషన్లు మారేనా!

- గ్రామాల్లో ఆశావహుల్లో ఆందోళన
- గత రిజర్వేషన్ ఆధారంగా ఇప్పటికే లక్షల్లో ఖర్చు చేసిన నాయకులు
- జిల్లాలో ప్రస్తుతం 844 గ్రామపంచాయతీలు
- మరో 24 జీపీలు, 163 వార్డుల పెంపునకు ప్రతిపాదన




నీలగిరి, డిసెంబర్ 15 : జిల్లాలో స్థానిక ఎన్నికలు చోటా నాయకుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికల పదవీ కాలం ఫిబ్రవరి1తో ముగుస్తుండడంతో అలోపు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించి ఆ దిశగా అడుగులు వేస్తున్నది. దీంతో స్థానిక నాయకుల్లో సందడి మొదలైనా రిజర్వేషన్లు వారిని కలవర పెడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రమేర్పడ్డాక మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా నూతన పంచాయతీ రాజ్ చట్టం రూపొందించి పదేండ్లు ఒకే రిజర్వేషన్ ఉండేలా రూపకల్పన చేసి స్థానిక ఎన్నికలు నిర్వహించారు. కొంతకాలంగా గ్రామాల్లో చోటా నాయకులు అవే రిజర్వేషన్లు అమలవుతాయని భావించచి ఆశావాహులు లక్షల్లో ఖర్చు చేశారు. ఇటీవల నూతన ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో గ్రామాల్లో చోటా నాయకుల్లో రిజర్వేషన్ల అంశం వారిలో గుబులు పుట్టిస్తున్నది. రిజర్వేషన్లు కలిసి వచ్చి సర్పంచ్, వార్డు సభ్యులుగా గెలవాలన్న ఆశావాహులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నెల చివరి వారంలో గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండడంతో రిజర్వేషన్ల ప్రక్రియ ప్రారంభిస్తారా లేక పాత వాటితోనే సరిపెడతారా అనే విషయం కొద్ది రోజుల్లో తెరపడనుంది.

### పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు

జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల హడావుడి మొదలైంది. అసెంబ్లీ ఎన్నికలు జరిగి 15రోజులు సైతం గడపకముందే గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు ప్రారంభించింది. ప్రస్తుతం కొనసాగుతున్న సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగుస్తుండడంతో ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నది. అందులో భాగంగా మూడు రోజుల క్రితం సిబ్బంది తదితర వివరాలను సేకరించింది. డిసెంబర్ చివరి వారంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నది. వచ్చే ఏడాది జనవరి మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదల చేసి మూడు దశల్లో ఎన్నికలు జరిపేలా ఏర్పాట్లు చేస్తున్నది. గత ఎన్నికలను రెవెన్యూ డివిజన్ల వారీగా మూడు దశల్లో ఎన్నికలు జరుపగా ఈసారి నాలుగో డివిజన్‌గా చండూర్ రావడంతో నల్లగొండ డివిజన్‌తో కలిపే ఎన్నికలు జరిపేలా జిల్లా యంత్రాంగం రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించినట్లు తెలిసింది. ప్రస్తుతం జిల్లాలో 844 గ్రామ పంచాయతీలు, 7,340 వార్డులు ఉన్నాయి. అయితే జిల్లాలో అదనంగా 24 గ్రామ పంచాయతీలు 163వార్డులను నూతనంగా ప్రతిపాదనలు చేశారు. వీటిపై స్పష్టత రానుంది. వీటిని ఆమోదిస్తే జిల్లాలో గ్రామ పంచాతీయల సంఖ్య 868కి, వార్డుల సంఖ్య 7,503కు పెరగనుంది. గత ఎన్నికల్లో ప్రస్తుతం స్థానాల సంఖ్య పరంగా బీఆర్ఎస్‌కు మెజార్టీ స్థానాలు ఉన్నాయి. 2024లో ఎన్నికల్లో సైతం మెజార్టీ స్థానాలు దక్కించుకునేలా ప్రయత్నాలు చేస్తుండగా అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ ఎక్కువ స్థానాలు సాదించే దిశగా పావులు కలుపుతున్నది. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా రిజర్వేషన్ల మార్పు బరిలో నిలిచే అభ్యర్థులపై చర్చ కొనసాగుతుంది.

### డిపాజిట్ గల్లంతైన, లెక్కలు ఇవ్వని వారి పరిస్థితి ఏంటి..

ఎన్నికల్లో పోటీ చేసి డిపాజిట్ గల్లంతైన అభ్యర్థులు ఆరేండ్ల వరకు పోటీ చేయరాదనే నిబంధన ఉంది. దీంతో ఇప్పుడు మళ్లీ పోటీకి సై అంటున్న వారిపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యర్థులు వ్యూహాలు రచిస్తున్నారు. 2019లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసి డిపాజిట్ రాని వారి వివరాలను గ్రామాల వారీగా సేకరిస్తున్నారు. ఒకవేళ మీరు పోటీ చేసేందుకు ముందుకు వస్తే డిపాజిట్ గల్లంతనే నిబంధన అడ్డు వచ్చే అవకాశం ఉంటుందని చర్చ జరుగుతుంది. దీంతో గతంలో బలమైన అభ్యర్థులుగా రంగంలోకి దిగి అనివార్య కారణాలతోటి పోటీకి దూరమైన, ఇతర కారణాలతో డిపాజిట్ రాని వారిని పోటీలో ఉండాలనుకుంటున్న వారు మేనేజ్ చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీనికి తోడు గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వారు ఎన్నికల ఖర్చులు ఇవ్వకుంటే పోటీకి అనర్హులుగా నిర్ణయించారు. దీంతో వీరు సైతం పోటీకి దూరమయ్యే అవకాశముంది.

### రిజర్వేషన్ల మార్పుపై చర్చ...

జిల్లాలో 2019 నాటి రిజర్వేషన్ల ప్రకారం సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తారా లేదా వాటి స్థానంలో కొత్తగా మారుస్తారా అనే విషయం తెలియాల్సి ఉంది. పంచాయతీ రాజ్ చట్టాన్ని అనుసరించి అవే రిజర్వేషన్లు అమలవుతాయని భావిస్తున్న ఆశావాహులు సర్పంచ్ పీఠమే లక్ష్యంగా పావులు కదిపారు. గడిచిన రెండేండ్లుగా కుల సంఘాలను మచ్చిక చేసుకోవడం, గ్రామాల్లో మంచి, చెడులకు ఆర్థిక సాయం, యుత్‌కు క్రికెట్ కిట్లు, విందులతో ఆకట్టుకుంటూనే క్షేత్రస్థాయిలో దూసుకు పోతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఆశావాహులు చిన్న గ్రామ పంచాయతీల్లో రూ.5లక్షల వరకు, మేజర్ గ్రామ పంచాయతీలో రూ.10లక్షలు, ఆపైన పెద్ద ఎత్తున ఖర్చు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ సర్పంచ్ ఎన్నికల్లో రిజర్వేషన్లు కలిసి రాకపోతే ఎంపీటీసీ, జడ్పీటీసీ బరిలో నిలిచేలా ప్లాన్ చేసుకుంటుటన్నట్లు తెలుస్తోంది.

# గుట్టలో 17నుంచి ధనుర్మాసోత్సవాలు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 15 : యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామి ప్రధానాలయంలో ఈ నెల 17నుంచి జనవరి 15వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తెలిపారు. ప్రధానాలయ మొదటి ఉత్తర ప్రాకార మండపంలో ప్రతిరోజూ ఉదయం 4.30నుంచి 5.15గంటల వరకు అర్చకులు వేద మంత్రాలు పటిస్తూ అమ్మవార్లకు తిరుప్పావై పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ధనుర్మాస విశిష్టతను భక్తులకు వివరిస్తారని తెలిపారు. గోదాదేవి రంగ నాయకుడిపై రచించిన పాశురాలను రోజుకొకటి చొప్పున 30 రోజుల పాటు పఠిస్తూ అర్చకులు మార్గళి పూజలు నిర్వహిస్తారని అన్నారు. పాశురాల పరమావధి ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించనున్నట్లు తెలిపారు. 2024 జనవరి 14వ తేదీన రాత్రి 7గంటలకు గోదాదేవి కల్యాణం ఉంటుందన్నారు. 15న ఉదయం 11.30గంటలకు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తామని తెలిపారు.



యాదగిరిగుట్టలో లక్ష్మీనర్సింహుల నిత్య కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

### వైభవంగా లక్ష్మీనర్సింహుల నిత్యారాధనలు

యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామికి నిత్యారాధనలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొల్పిన అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. లక్ష్మీ సమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా కల్యాణ తంతు జరిపించారు. కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులకు సువర్ణ పుష్పార్చనలు చేశారు. బంగారు పుష్పాలతో దేవేరులను అర్చన చేశారు. సాయంత్రం వేళలో స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవ నిర్వహించారు. అద్దాల మండపంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవను కోలాహలంగా నిర్వహించారు. పరమ పవిత్రంగా నిర్వహించే సేవలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. ముత్తయిదువులు మంగళ హారతులతో అమ్మవారిని స్తుతిస్తూ పాటలు పాడుతూ సేవ ముందు నడిచారు. తిరువీధి సేవ అనంతరం అమ్మవారిని అద్దాల మండపంలోని ఊయలలో శయనింపు చేశారు. అమ్మవారిని కొనియాడుతూ గంట పాటు వివిధ రకాల పాటలతో లాలిపాటలు పాడారు. రాత్రి స్వామికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేశారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలు కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.23,66,593 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తెలిపారు.

# జాతీయ స్థాయి జూనియర్ పోటీలకు 17న జిల్లా జట్ల ఎంపిక

భువనగిరి అర్బన్, డిసెంబర్ 15 : అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 17న జూనియర్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి జాతీయ స్థాయి పోటీలకు జట్లు ఎంపిక చేయనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కోనేటి గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14,16విభాగంలో 16ఏండ్ల లోపు బాలబాలికలు మాత్రమే పాల్గొనాలని కోరారు. అండర్–14లోపు క్రీడాకారులకు ట్రై అథ్లెటిక్, కిడ్స్ జావెలిన్ త్రో, అండర్–16 లోపు బాలబాలికలకు 60నుంచి 600మీటర్ల వరకు హై జంప్, షాట్‌పుట్, జావెలిన్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి మూడు స్థానాలు సాధించిన విజేతలకు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలు పూర్తిగా రాష్ట్రస్థాయి ప్రమాణాల ఆధారంగానే ఉంటాయని, ఉత్తమ ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఫిబ్రవరి 2024 గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రధాన కార్యదర్శి కోనేటి గోపాల్ 9949271718నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### 20న క్రాస్ కంట్రీ క్రీడాకారుల ఎంపికలు

భువనగిరి చెరువు కట్టపై క్రాస్ కంట్రీ క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 20న ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కోనేటి గోపాల్ తెలిపారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారు కామారెడ్డి జిల్లాలో ఈ నెల 23న నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

# ఎన్నికల ఖర్చు వివరాలు సమర్పించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, డిసెంబర్ 15 : అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చు వివరాలు ఈ నెల 27వ తేదీలోగా సమర్పించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ రిటర్నింగ్ అధికారులను, సహాయ వ్యయ పర్యవేక్షణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిటర్నింగ్, సహాయ వ్యయ పర్యవేక్షణ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అభ్యర్థులు ప్రతిరోజూ నిర్వహించిన అకౌంట్స్, క్యాష్, బ్యాంక్ రిజిస్టర్లు, సమగ్ర వివరాలను నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. సీ–13 రిపోర్ట్స్, అనెక్సర్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రొఫార్మాల్లో నింపే విధానాన్ని అధికారులు స్వయంగా పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఎన్కోర్ ద్వారా సంబంధిత డేటాను నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి ఆర్.కిరణ్‌కుమార్, రిటర్నింగ్ అధికారులు రవి, చెన్నయ్య, శ్రీరాములు, దామోదర్ పాల్గొన్నారు.

### పెద్దలకు పాదపూజ



భువనగిరి పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో 60వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాతలు, నాయినమ్మలు, అమ్మమ్మలు, ఉపాధ్యాయులకు పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

- భువనగిరి అర్బన్, డిసెంబర్ 15